సాక్షి నంద్యాల

సోమవారం, 8, మే, 2023



భ్రామరీకి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



మహానందిలో భక్తుల సందడి

మహానంది: మహానంది ఆలయానికి ఆదివారం భక్తులు తరలివచ్చారు. భక్తులు కోనేరులలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామిని దర్శించుకున్నారు.



పీడిస్తున్న 'రక్తపిశాచి'

పుట్టుకతోనే తలసీమియా జబ్బుతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 160 మంది చిన్నారులు నరకయాతన అనుభవిస్తున్నారు. వీరికి నెలలో ఒకటి, రెండుసార్లు అవసరమైన రక్తం ఎక్కించాల్సి ఉంది. 8లో

న్యూస్‌రీల్

నేడు స్పందన

నంద్యాల: స్థానిక వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ హాజరు కావాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయిల్లో కూడా యథాతథంగా స్పందన కార్యక్రమం ఉంటుందన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

నంద్యాల(అర్బన్): జిల్లాలో శనివారం సాయంత్రం ఆదివారం ఉదయం వరకు ఓ మోస్తరు వర్షం కురిసిందని ఇన్‌చార్జ్ డీఆర్ఓ కామేశ్వరరావు ఆదివారం తెలిపారు. బండిఆత్మకూరు మండలంలో 6.8 మి.మీ, పాణ్యంలో 4.2, ప్యాపిలిలో 1.8 మి.మీ వర్షం కురిసిందన్నారు. మొత్తం మీద 0.4మి.మీ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.

కమనీయం.. మహానందీశ్వర కల్యాణం



మహానంది: శ్రీ గంగా, కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వర స్వామివార్లకు ఆదివారం కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. వేదపండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను అర్చకులు విశేషంగా అలంకరించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం అలంకార పూజ, అక్షతల సమర్పణ, మాంగల్య ధారణ పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. వివిధ ప్రాంతాల భక్తులు ప్రత్యక్ష, పరోక్షసేవల ద్వారా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

రూ.3.87 కోట్ల 'గడప గడపకు' నిధులు విడుదల

కర్నూలు (టౌన్): గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద జిల్లాలోని 8 మునిసిపాలిటీలకు రూ.3.87 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఆత్మకూరుకు రూ. 76 లక్షలు, నందికొట్కూరు రూ. 65 లక్షలు, డోన్‌కు రూ. 64 లక్షలు, నంద్యాలకు రూ. 64 లక్షలు, ఆదోనికి రూ. 65 లక్షలు, ఎమ్మిగనూరుకు రూ. 32 లక్షలు, ఆళ్లగడ్డకు రూ. 16 లక్షలు, గూడూరుకు రూ. 5 లక్షల చొప్పున విడుదలయ్యాయి. గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యేలు ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకొని, ప్రాధాన్యత క్రమంలో వాటిని పరిష్కరిస్తున్నారు. ఇప్పటికే మొదటి విడత కింద నిధులు విడుదల చేసిన ప్రభుత్వం తాజాగా రెండో విడత అభివృద్ధి పనులకు రూ. 3.87 కోట్లను ఉమ్మడి కర్నూలు జిల్లాకు కేటాయించింది.

సర్కారు స్కూళ్లు అదరహో!

- పదో తరగతిలో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలలు
- కార్పొరేట్‌కు దీటుగా విద్యార్థులు ఉత్తమ మార్కుల సాధన
- సత్ఫలితాలు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వ చర్యలు
- 7,031 మంది ఉత్తీర్ణ సాధించగా 4,003 మంది ప్రథమ శ్రేణి
- అవుకు జెడ్పీ పాఠశాల విద్యార్థికి 590 మార్కులు

90 % శ్రీశైలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో మొత్తం 90 మంది విద్యార్థుల్లో 81 మంది ఉత్తీర్ణులు కావడంతో 90 శాతం ఉత్తీర్ణత శాతం నమోదైంది. వీరిలో 31 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో, 27 మంది ద్వితీయ శ్రేణిలో, 23 మంది తృతీయ శ్రేణిలో పాసయ్యారు.

88.5 % కోవెలకుంట్ల పట్టణ శివారులోని బాలిక గురుకుల పాఠశాలలో 78 మంది విద్యార్థినిలు పరీక్ష రాయగా 69 మంది పాస్ కాగా.. ఉత్తీర్ణ శాతం 88.5గా నమోదైంది. 67 మంది ప్రథమ శ్రేణిలో, ఇద్దరు ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. పాఠశాలలో 17 మంది విద్యార్థినిలు 500కు పైగా మార్కులు సాధించి ప్రతిభ చాటారు.

81.44 % పగిద్యాల మోడల్ పాఠశాల పదో తరగతి విద్యార్థులు పరీక్ష ఫలితాల్లో సత్తా చాటారు. 97 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 79 మంది పాసయ్యారు. ఉత్తీర్ణ శాతం 81.44గా నమోదైంది. పాసైన వారిలో ప్రథమ శ్రేణిలో 42 మంది, ద్వితీయ శ్రేణిలో 24 మంది, తృతీయ శ్రేణిలో 13 మంది ఉన్నారు. ఆరుగురు విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారు.

నంద్యాల(సిటీ): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 590.. 587.. 585.. 583.. 583..580.. ఈ మార్కులు సాధించి ఏ కార్పొరేటో.. ప్రైవేటు విద్యార్థులు కాదు.. సర్కారు స్కూళ్ల విద్యార్థులంటే ఆశ్చర్యపోవాల్సిందే. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్య, సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ పరీక్ష ఫలితాల్లో మేము సైతం అంటూ టాప్ స్థానాల్లో నిలిచారు. శనివారం విడుదలైన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తగ్గకుండా జయకేతనం ఎగుర వేశారు. అకడమిక్ క్యాలండర్ సక్రమంగా అమలు కావడం, సకాలంలో పాఠ్యపుస్తకాలు అందడం, జగనన్న గోరుముద్ద పౌష్టిక ఆహారం అందించడం, ప్రత్యేక తరగతులు నిర్వహించడం, వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించడం క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించడం లాంటివి మెరుగైన ఫలితాలు రావడానికి దోహదపడ్డాయి. గత ఏడాది కంటే ఫలితాల శాతం పెరగడంతో పాటు ఉత్తమ మార్కులు కైవసం చేసుకొని ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల్లో చదివితేనే సర్వతోముఖాభివృద్ధి ఉంటుందని నమ్మకం కలిగించాయి. జిల్లాలోని 454 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మొత్తం 22,457 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 13,562 మంది పాసయ్యారు. అలాగే 272 ప్రభుత్వ పాఠశాలల్లో 14,693 మంది విద్యార్థులకు గాను 7,031 మంది ఉత్తీర్ణ సాధించారు. మొత్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 47.85 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రథమ శ్రేణిలో 4,003 మందికి, ద్వితీయ శ్రేణిలో స్థానంలో 1,967 మంది, తృతీయ స్థానంలో 1061 మంది విద్యార్థులు పాసయ్యారు. అదేవిధంగా 500లకు పైగా మార్కులు 625 మందికి వచ్చాయి, 550కి పైగా 131 మంది అత్యధికంగా మార్కులు సాధించారు. అవుకు మోడల్ స్కూల్ విద్యార్థి షేక్ మహమ్మద్ సమీర్ 590 మార్కులు, కోవెలకుంట్ల జెడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని జి.హర్షిత 587, ఆత్మకూరు జెడ్పీహెచ్ఎస్ స్కూల్ విద్యార్థిని షేక్ షబ్రీన్ 585, అవుకు జెడ్పీ పాఠశాల విద్యార్థి బండ్ల భూమా సాయిసంతోష్ 583, నంద్యాల మోడల్ స్కూల్ విద్యార్థిని 583, పాములపాడు మండలం వేంపెంట జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని దేశావత్ మౌల్యశ్రీబాయ్ 580 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాల సత్తా చాటారు. జిల్లాలోని శ్రీశైలం డ్యామ్‌లోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల, కోవెలకుంట్ల జిల్లా పరిషత్ ఉర్దూ పాఠశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి.



ఫలితాన్నిచ్చిన అధికారుల చర్యలు

ఈ ఏడాది పదో తరగతి ఫలితాలు పెంచేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో వెనుకబడి విద్యార్థులపై శ్రద్ధ తీసుకున్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహించి వారిని మెరుగు పరిచారు. అంతేకాకుండా రాత్రి సమయంలో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి బాగా చదువుకోవాలని సూచించారు. పరీక్షల ముందు విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టేందుకు ప్రేరణ తరగతులు నిర్వహించారు.

పక్కాగా ప్రణాళిక అమలు చేశాం



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణ శాతం పెంచేందుకు చేపట్టిన చర్యలు సత్ఫలితాలిచ్చాయి. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు శ్రద్ధ పెట్టి తీర్చిదిద్దారు. పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించడంలో పక్కాగా ప్రణాళిక అమలుచేశాం.– అనురాధ, డీఈఓ, నంద్యాల

సివిల్స్‌లో మంచి ర్యాంక్ సాధిస్తా..



మాది అవుకు పట్టణం. నాన్న షేక్ అక్తర్ హుస్సేన్ టైలర్‌గా, అమ్మ షేక్ పర్వీన్ అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తున్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 590 మార్కులు సాధించడం ఎంతో సంతోషంగా ఉంది. 8వ తరగతిలో ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో కూడా ప్రతిభ కనబరిచి స్కాలర్‌షిప్‌ను అందుకుంటున్నాను. అమ్మానాన్నలు నాపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వారి ఆశయాన్ని తప్పక నెరవేర్చుతా. బాగా చదివి ఐఏఎస్ కావాలన్నదే నా జీవిత లక్ష్యం. – షేక్ మహమ్మద్ సమీర్, అవుకు మోడల్ స్కూల్

ఐఏఎస్ అయితా..



మేము కోవెలకుంట్ల రంగరాజు పేటలో నివాసముంటున్నాం. అమ్మ రజిత గృహిణి, నాన్న పెద్దిరెడ్డి ఆర్మీలో పని చేసి రిటైర్డ్ అయ్యారు. నాకు పదో తరగతి ఫలితాల్లో 587 మార్కులు సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో చక్కగా చదువుకుని మంచి మార్కులు సాధించాను. భవిష్యత్‌లో ఉన్నత చదువులు చదివి ఐఏఎస్ సాధించి పేదలకు సేవ చేయాలన్నదే నా లక్ష్యం. – హర్షిత, కోవెలకుంట్ల జెడ్పీ స్కూల్



పేరు: చాకలి రాజేశ్వరి, మార్కులు: 583
పాఠశాల: నంద్యాల మోడల్ స్కూల్
స్వస్థలం: బొమ్మలసత్రం
తల్లిదండ్రులు: రామలక్ష్మి, దస్తగిరి
వృత్తి: లారీ డ్రైవర్, లక్ష్యం: ఐఏఎస్



పేరు: బండ్ల భూమా సాయి సంతోష్
మార్కులు: 583
పాఠశాల: అవుకు జెడ్పీ ఉన్నత పాఠశాల
స్వస్థలం: అవుకు
తల్లిదండ్రులు: సుజాత, మల్లికార్జున(లేట్)
వృత్తి: ఫ్యాన్సీ స్టోర్
లక్ష్యం: ఐఐటీలో సీటు సాధించడం



పేరు: మౌల్యాశ్రీబాయి
మార్కులు: 580
పాఠశాల: వేంపెంట జెడ్పీ ఉన్నత పాఠశాల
స్వస్థలం: వేంపెట
తల్లిదండ్రులు: పుష్పాబాయి, రమేష్ నాయక్
వృత్తి: రైతు లక్ష్యం: డాక్టర్

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం..

పాఠశాల	సంఖ్య	ఉత్తీర్ణత శాతం
ఎయిడెడ్	12	49.19
జ్యోతిబాపూలే	05	90.21
ప్రభుత్వ	16	31.72
ఆశ్రమ పాఠశాల	05	64.79
కేజీబీవీ	27	52.21
మున్సిపల్	04	48.96
మోడల్ స్కూల్	20	63.77
రెసిడెన్షియల్	05	83.84
ట్రైబల్ వెల్ఫేర్	04	68.25
జెడ్పీహెచ్ఎస్	179	42.60
మొత్తం	272	47.85

5వేల హెక్టార్లలో సూక్ష్మ సేద్యం

- ఏపీ సూక్ష్మ సేద్య పథకం ఓఎస్‌డీ వైవీఎస్ ప్రసాద్

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో 2023–24 సంవత్సరానికి 5000 హెక్టార్లకు సూక్ష్మ సేద్యం కల్పించే విధంగా ప్రభుత్వం లక్ష్యాలను ఇచ్చిందని ఏపీ సూక్ష్మ సేద్య పథకం ఓఎస్‌డీ వైవీఎస్ ప్రసాద్ తెలిపారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న ఉద్యాన పంటలను పరిశీలించేందుకు ఆదివారం ఆయన జిల్లాకు వచ్చారు. హెచ్ కైరవాడి, కులుమాల, పెద్దమరివీడు గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న మిరప, బొప్పాయి పంటలను పరిశీలించారు. పొలాలు, కల్లం దొడ్లలో ఆరబెట్టిన మిరపను పరిశీలించి రైతులతో మాట్లాడారు. గోనెగండ్ల మండలం వేముగోడు, ఎమ్మిగనూరు మండలం గువ్వలదొడ్డి, కందనాతి గ్రామాల్లో పంటలకు రాయితీతో అమర్చిన డ్రిప్ పరికరాలను పరిశీలించారు. సాయంత్రం కర్నూలు కలెక్టరేట్‌లోని ఏపీఎంఐపీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆయన వెంట ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవీ, ఏపీడీ రాజాకృష్ణారెడ్డి, ఎమ్మిగనూరు ఉద్యాన అధికారి శ్రీవాణి ఉన్నారు.



బొప్పాయి తోటను పరిశీలిస్తున్న అధికారులు

జూన్ 11న 'మోడల్' పరీక్ష

కర్నూలు కల్చరల్: జిల్లాలోని 16 మోడల్ స్కూళ్లలో 6వ తరగతి ప్రవేశాలకు జూన్ 11వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈఓ రంగారెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. ఈనెల 9 నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. 2022–23 సంవత్సరంలో 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులు 2011 సెప్టెంబర్ 1 నుంచి 2013 ఆగస్టు 31 మధ్య, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2009 సెప్టెంబర్ 1 నుంచి 2013 ఆగస్టు 31 మధ్యలో జన్మించి ఉండాలని తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 పరీక్ష రుసుం చెల్లించాలని పేర్కొన్నారు. జూన్ 16న మెరిట్ లిస్ట్ ప్రచురించి 19న ఎంపికైన విద్యార్థుల జాబితాను ప్రచురిస్తారని పేర్కొన్నారు. 19వ తేదీన ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేవారు మే 9వ తేదీ నుంచి https://apms.ap.gov.in/apms వెబ్‌సైట్‌ను సందర్శించ వచ్చని సూచించారు.

మహాకుంభాభిషేకం ఏర్పాట్లు షురూ



యాగశాల ఏర్పాట్ల ప్రారంభ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో ఈనెల 25 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న మహాకుంభాభిషేక మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో యాగశాలల ఏర్పాట్లు పనులు ఆదివారం ప్రారంభించారు. యాగశాలల ఏర్పాట్లను సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి ప్రారంభించారు. సహస్రదీపాలంకరణ మండపం ఎడమవైపు నిర్మించనున్న యాగశాల పనులు ప్రారంభించారు. అనంతరం ఈఓ లవన్న మూడు శివాలయాలకు, ఆలయ హరిహర రాయగోపురానికి ఏర్పాటు చేస్తున్న పరంజా పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ అన్నీ గోపురాలకు కూడా పరంజాలు ధృడంగా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పరంజా పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. పునరుద్ధరించిన ఆలయాలలో ప్రతిష్టించనున్నశివలింగాలను, నందీశ్వరమూర్తులను ఈ నెల 20వ తేదీకి సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో స్వామివార్ల ప్రధానార్చకులు హెచ్ వీరయ్యస్వామి, శివప్రసాదస్వామి, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు వి.రామకృష్ణ, ఎం నరసింహారెడ్డి, ఆలయ సహాయకార్యనిర్వాహణాధికారి ఎం.హరిదాసు, శ్రీశైలప్రభ సంపాదకులు సి.అనిల్‌కుమార్, ప్రజా సంబంధాల అధికారి టి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యంత్రం సిద్ధం.. సాగుకు సన్నద్ధం!

- వైఎస్సార్ యంత్ర సేవా పథకం రైతులకు వరం
- అందుబాటులోకి ఆధునిక యంత్రాలు
- సబ్సిడీపై రైతు గ్రూపులకు మంజూరు
- సీహెచ్‌సీల ద్వారా తక్కువ అద్దెపై సరఫరా
- జిల్లాలో 308 గ్రూపులకు యూనిట్ల కేటాయింపు

వ్యవసాయంలో రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకుంటూ యంత్ర సేద్యం దిశగా ముందుకు సాగుతున్నారు. విత్తు నుంచి పంట నూర్పిడి వరకు పొలాల్లో యంత్రాల వినియోగం గతంతో పోల్చుకుంటే ఇటీవల భారీగా పెరిగింది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనందిస్తోంది. వైఎస్సార్ యంత్ర సేవా పథకం సబ్సిడీపై అత్యాధునిక వ్యవసాయ పరికరాలను అందుబాటులో ఉంచడంతో రైతులకు వరంగా మారింది.

ఆళ్లగడ్డ: రైతుల్లో అధిక శాతం మంది సన్న, చిన్నకారు రైతులు, కౌలుదారులే ఉన్నారు. దుక్కులు మొదలు పంట కోత, నూర్పిడి వరకు కూలీల కష్టాలు వెంటాడుతూనే ఉంటాయి. కొంత మంది వ్యాపారులు, బడా రైతుల చేతుల్లో ఉండే యంత్రాలు, యంత్ర పరికరాల కోసం అధిక మొత్తం చెల్లించాల్సిందే. రైతుల సమస్యను గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సన్న, చిన్నకారు రైతులకు అండగా నిలిచేందుకు 'వైఎస్సార్ యంత్ర సేవా పథకం' తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా భారీ రాయితీతో వ్యవసాయ యంత్రాలను, పరికరాలను అందుబాటులో వచ్చేశాయి. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే 40 శాతం రాయితీపై ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలను అందజేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. జిల్లాలోని 29 మండలాల్లోని 411 రైతు గ్రూపులు ఉండగా ఇప్పటి వరకు 308 గ్రూపులకు యూనిట్లు మంజూరయ్యాయి. మొదటి విడతలో 169 గ్రూపులకు యంత్ర పరికరాలను మంజూరు కాగా, రెండో విడతలో 147 గ్రూపుల లక్ష్యం కాగా ఈ ఏడాది ఇప్పటి వరకు 139 గ్రూపులకు మంజూరు చేశారు. ఇందులో 226 ట్రాక్టర్లు, 22 హార్వెస్టర్లు, 60 వ్యవసాయ యంత్ర పరికరాలు మంజూరయ్యాయి. వీటికి సంబంధించి ప్రభుత్వం రూ 18.24 కోట్ల సబ్సిడీని రైతు సంఘాల ఖాతాల్లో జమ చేసింది.



ట్రాక్టర్



నూర్పిడి యంత్రం

రైతు సంఘం వాటా 10 శాతమే..

ఒక్కో గ్రూపునకు యూనిట్ విలువ రూ. 15 లక్షలుగా నిర్ణయించారు. ఈ సొమ్ముతో వారికి ఏవి ఉపయోగపడుతాయో ఆ వ్యవసాయ యంత్ర పరికరాలను మాత్రమే కొనుగోలు చేయవచ్చు. ఇందులో ప్రభుత్వం రాయితీ కింద 40 శాతం ఒక్కో రైతు గ్రూపునకు రూ. 6 లక్షలు చెల్లిస్తోంది. బ్యాంకు రుణం కింద మరో 50 శాతం మంజూరు చేయగా మిగిలిన 10 శాతం మాత్రం రైతులు చేతి నుంచి చెల్లించాలి.

అద్దెకు యంత్రాలు..

రైతు భరోసా కేంద్రాలకు అనుబంధంగా అద్దె ప్రాతిపదికన యంత్రాలు ఇచ్చేందుకు కస్టమ్ హయ్యరింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో సన్న, చిన్న కారు రైతులను కనీసం ఐదుగురిని కలిపి ఒక సంఘంగా ఏర్పాటు చేశారు. వీరిలో కన్వీనర్, కో – కన్వీనర్ బాధ్యతలతో బ్యాంకు ఖాతా తెరిపిస్తున్నారు. ఆ సంఘం సభ్యులందరూ రైతులతో మాట్లాడుకుని వారికి వ్యవసాయం చేసుకునేందుకు ఏఏ పరికరాలు అవసరమవుతాయో నిర్ణయించుకుంటారు. ట్రాక్టర్లు, వరినాట్లు యంత్రాలు, సేద్య పరికరాలు, విత్తనపు, పిచికారీ యంత్రాలను సంఘం తరుపున కొనుగోలు చేస్తారు. వీటికి అద్దెలు నిర్ణయించి అవసరమైన రైతులు ఆయా పనులకు ఉపయోగించుకునే విధంగా చర్యలు చేపడుతున్నారు. ఇలా అద్దె రూపంలో వచ్చిన సొమ్ముతో బ్యాంకు రుణాలను విడతల వారీగా చెల్లించాల్సి ఉంటుంది.

రైతుల నుంచి అనూహ్య స్పందన

వైఎస్సార్ యంత్ర సేవా పథకానికి అన్నదాతల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ యంత్ర పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్న తరువాత అవి ఎంత కాలానికి మంజూరవుతుందో తెలిసేది కాదు. మంజూరైనా రాయితీ సొమ్ము వస్తుందో? రాదో? కూడా తెలిసేది కాదు. ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న 30 నుంచి 40 రోజుల వ్యవధిలోనే మంజూరు చేయడం, యూనిట్ గ్రౌండింగ్ చేసిన వెంటనే వారం నుంచి నెలలోపే రైతు గ్రూపుల ఖాతాల్లో ప్రభుత్వ రాయితీ సొమ్ము జమ అవుతోంది. అలాగే వ్యవసాయాధికారులు, రైతు భరోసా కేంద్ర సిబ్బంది బ్యాంకర్లతో మాట్లాడి ఎలాంటి ష్యూరిటీ లేకుండానే రుణం ఇప్పించడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా మంజూరు చేసే వ్యవసాయ యంత్ర పరికాలను రైతులను సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలో మూడు విడతల్లో ఈ పథకం అమలు చేయనున్నాం. ఇప్పటి వరకు రెండు విడతల్లో సుమారు 308 రైతు గ్రూపులకు యంత్ర పరికరాలు అందజేశాం. ఖరీఫ్ లోగా మిగతా గ్రూపులకు కేటాయిస్తాం. ప్రభుత్వం నెలలోపే రాయితీ సొమ్ము బ్యాంకుల ఖాతాల్లో జమ చేస్తుండటంతో బ్యాంకులు కూడా రుణాలు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నాయి.

– మోహన్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి

నెలలోపే రాయితీ వచ్చింది



గతేడాది రబీ సీజన్‌లో వైఎస్సార్ రైతు యంత్ర సేవా పథకానికి దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం రూ.15 లక్షలతో యూనిట్ మంజూరు చేసింది. ఆళ్లగడ్డ కేడీసీసీ బ్రాంచ్‌లో ఎటువంటి పూచీ లేకుండా 50 శాతం రుణం మంజూరు చేయగా లబ్ధిదారులు వాటా కింద గ్రూపు సభ్యులం 50 శాతం చెల్లించాం. ట్రాక్టర్, బహుళ పంటల నూర్పిడి యంత్రం, రోటావేటర్, విత్తన గొర్రు తదితర వ్యవసాయ యంత్రాలను కొనుగోలు చేశాం. యంత్రాలు తీసుకున్న నెల లోపే ప్రభుత్వం రూ.6 లక్షలు రాయితీ సొమ్ము జమ చేసింది. యంత్రాలను బాడుగకు ఇవ్వడంతో మా రైతు మిత్ర గ్రూపునకు సుమారు రూ. 3 లక్షల వరకు ఆదాయం వచ్చింది.

– శివపార్వతి, కన్వీనర్, ఇందిర ప్రియదర్శిని రైతు మిత్ర గ్రూపు, కృష్ణాపురం

సీఎం రైతు పక్షపాతి



గతంలో లోతు దుక్కులు దున్నాలంటే పక్క ఊరి నుంచి అద్దెకు ట్రాక్టర్లను తీసుకొచ్చే వాళ్లం. ఒక్కోసారి సరైన సమయానికి రాక పోవడంతో పాటు డబ్బులు ఎక్కువగా అడిగే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మా గ్రామంలోనే కొందరు రైతులం గ్రూపుగా ఏర్పాటై వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద రూ 11.20 లక్షలతో ట్రాక్టర్, రూ. 4 లక్షలతో ట్రిల్లర్, రివర్స్ ప్లౌ కొనుగోలు చేశాం. నెలలో ప్రభుత్వం రూ. 6 లక్షలు రాయితీ సొమ్ము రైతు మిత్ర ఖాతాలో జమ చేసింది. యంత్రాలను గ్రామంలో రైతులకు సరసమైన ధరలకు బాడుగకు ఇస్తున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అనేదానికి ఇదే నిదర్శనం.

– మోడే లక్ష్మణ్ నాయక్, శ్రీనివాస రైతు మిత్ర గ్రూప్ కన్వీనర్, బి.పి తండా

ఇద్దరు బాలికలు అదృశ్యం

- రాత్రి పొద్దుపోయేంత వరకు కనిపించని ఆచూకీ
- కొనసాగుతున్న పోలీసుల గాలింపు చర్యలు

ఆళ్లగడ్డ: మండల పరిధిలోని కొండంపల్లెలో ఆదివారం ఇద్దరు బాలికలు అదృశ్యమయ్యారు. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయేవరకు గ్రామస్తులు, పోలీసులు విస్తృతంగా గాలింపు చేపట్టినా ఆచూకీ లభించ లేదు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. కొండపల్లి గ్రామానికి చెందిన 14 సంవత్సరాల బాలిక ఆదివారం ఉదయం తన 6 సంవత్సరాల చెల్లెలును పిలుచుకుని ఇంట్లో ఎవరూ లేని సమయంలో బయటకు వెళ్లింది. ముత్యాలపాడు జాతరకు వెళ్లిన వారి తల్లి ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లో ఉండాల్సిన కూతుర్లు కనిపించలేదు. దీంతో ఇరుగు పొరుగు వారిని విచారించగా ఉదయం సుమారు 11 గంటల సమయంలో ఇద్దరు రోడ్డు వెంట వెళ్తుండటం చూశామని చెప్పారు. పొరుగు గ్రామాల్లోని బంధువులు, తెలిసిన వారి ఇళ్లదగ్గరకు వెళ్లి విచారించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పాటు చీకటి పడినా బాలికలు ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు.. పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బాలికల అదృశ్యంపై తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మూడు ప్రత్యేక బృందాలతో విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నామని ఎస్ఐ నరసింహులు తెలిపారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్యాపిలి: మండల పరిధిలోని వెంగళాంపల్లి గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మాధవరం గ్రామానికి చెందిన రామకృష్ణుడు (40) పని మీద బైక్‌పై ప్యాపిలికి వచ్చి తిరిగి వెళ్తుండగా వెంగళాంపల్లి వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన అరుణాచల ట్రాన్స్‌పోర్టు లారీ ఢీ కొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రామకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సులోచన, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్యాపిలి ఎస్‌ఐ సీఎం రాకేశ్ తెలిపారు.

ఈతకెళ్లి యువకుడు..


బాదుల్లా (ఫైల్)

శిరివెళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ప్రాంతానికి చెందిన షేక్ ఉబేదుల్లా (21) ఆదివారం బావిలో ఈతకెళ్లి మృత్యువాత పడ్డాడు. గౌండా పని చేసుకుంటున్న యువకుడు స్నేహితులతో కలసి బావిలో ఈత కొడుతూ పూడికలో కూరుకుపోయి మృతి చెందాడు. స్నేహితులు రక్షించే ప్రయత్నం చేసినా ఫలించలేదు. కుమారుని మరణవార్త విని తండ్రి చాంద్‌బాషా, కుటుంబ సభ్యులు, బంధువులు శోక సముద్రంలో మునిగిపోయారు.

అప్పు విషయంలో ఇరు వర్గాల ఘర్షణ

బొమ్మలసత్రం: అప్పు తిరిగి చెల్లించే విషయంలో ఇరువర్గాలు ఘర్షణ పడిన సంఘటన ఆదివారం నంద్యాల పట్టణంలో చోటుచేసుకుంది. త్రీటౌన్ సీఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని నూనెపల్లికి చెందిన మహబూబ్‌బాషా తన సోదరుడు జాకీర్‌తో కలిసి పత్తి వ్యాపారం చేసేవాడు. గత నెల క్రితం వ్యాపారంలో మనస్పర్థలు రావడంతో మహబూబ్‌బాషా కొంత నగదు జాకీర్‌కు ఇవ్వాల్సిందిగా పెద్దలు పంచాయితీ చేసి ఒప్పించారు. ఈ అప్పు విషయంలో ఆదివారం వారి మధ్య ఘర్షణ మొదలైంది. ఈ క్రమంలో మహబూబ్‌బాషా కుమారుడు హుస్సేన్‌బాషాకు జాకీర్ కుమారుడు నిహార్‌లు ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. ఇద్దరికి గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మహబూబ్‌బాషా ఫిర్యాదు మేరకూ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ సంస్థకు రూ.1.05 కోట్ల 'అకాల' నష్టం

కర్నూలు(రాజ్‌విహార్): అకాల వర్షాలతో విద్యుత్ సంస్థకు రూ.1.05 కోట్ల నష్టం వాటిల్లినట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఐదారు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో ఉమ్మడి జిల్లాలో సుమారు 350 స్తంభాలు పడిపోయాయని, 52 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయన్నారు. వీటి పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయించామన్నారు. ఎక్కడైనా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే లైన్‌మ్యాన్, ఏఈ, విద్యుత్ భవన్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం 7382614308కు ఫిర్యాదు చేయాలన్నారు.

పీడిస్తున్న 'రక్తపిశాచి'

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 160 మంది తలసీమియా బాధితులు
- బాధితులకు నెలకు రూ.10వేల ప్రత్యేక పింఛన్ ఇస్తున్న ప్రభుత్వం
- కర్నూలు పెద్దాసుపత్రిలో ఉచితంగా చికిత్స
- నేడు వరల్డ్ తలసీమియాడే


తలసీమియాతో బాధపడుతున్న చిన్నారులు

కర్నూలు(హాస్పిటల్): అభం శుభం తెలియని చిన్నారులు వారు. ఏ జబ్బు వచ్చిందో.. ఎందుకు వచ్చిందో కూడా తెలుసుకోలేని వయసు వారిది. ప్రతి నెలా రెండుసార్లు తల్లిదండ్రులు తమను ఆసుపత్రికి తీసుకెళ్లి రక్తం ఎక్కిస్తారని, ఏవేవో మందులు మింగిస్తారని మాత్రం అర్థం అవుతూ ఉంటుంది. కానీ అందరి పిల్లల్లా తామెందుకు ఆడుకోలేమని అటు వైద్యులు, ఇటు తల్లిదండ్రులను అడిగితే వారికి అర్థమయ్యే రీతిలో చెప్పే ధైర్యం ఏ ఒక్కరికీ లేదు. పుట్టుకతోనే తలసీమియా అనే జబ్బుతో వీరు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ నెల 8వన వరల్డ్ తలసీమియా డే సందర్భంగా ప్రత్యేక కథనం.

ప్రతి నెలా రూ.10వేల పెన్షన్

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 160 మంది దాకా తలసీమియా బాధితులు ఉండగా ఒక్క కర్నూలు జిల్లాలోనే 117 మంది చిన్నారులు ఉన్నారు. వీరికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని చిన్నపిల్లల విభాగంలో ఉన్న డైస్ కేంద్రంలో వైద్యులు ఉచితంగా చికిత్స అందిస్తున్నారు. వ్యాధి తీవ్రతను బట్టి ఆ చిన్నారులకు నెలలో ఒకటి, రెండుసార్లు అవసరమైన రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. ఈ మేరకు ఆ పిల్లల తల్లిదండ్రులకు ప్రయాణఖర్చులు, ఇతర ఖర్చుల కోసం ప్రతి నెలా రూ.3వేలకు పైగా ఖర్చు అవుతోంది. తన పాదయాత్రలో ఈ చిన్నారుల ఇబ్బందులను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వారికి ప్రతి నెలా రూ.10వేల ప్రత్యేక పెన్షన్ ఇస్తానని హామీ ఇచ్చి అమలు చేస్తున్నారు.

వ్యాధి ఎవరికి వస్తుందంటే..

శరీరంలోని ఎముక మూలిగలో హిమోగ్లోబిన్ ఉండే ఎర్ర రక్తకణాల ఉత్పత్తి నిలిచిపోవడాన్నే తలసీమియా వ్యాధి అంటారు. ఇది జన్యు సంబంధమైన వ్యాధి. మేనరికపు వివాహాలు చేసుకున్న తల్లిదండ్రుల మూలంగా చాలా వరకు జన్యుపరంగా ఈ వ్యాధి పిల్లల్లో వస్తోంది. తలసీమియా జన్యువాహకులైన తల్లిదండ్రులకు జన్మించే బిడ్డల్లో పాతిక శాతం మంది పుట్టుకతో ఈ వ్యాధికి గురవుతున్నారు. మరో 25 శాతం సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటే మరో 50 శాతం మంది తలసీమియా మైనర్‌గా మిగిలిపోతున్నారు. అయితే వీరికి పెద్దగా సమస్యలు ఉండవు. కానీ వీరు పెళ్లి చేసుకున్న వారి ద్వారా వారికి కలిగే సంతానానికి తలసీమియా వచ్చే అవకాశం ఉంది. తలసీమియా రోగుల్లో శరీరానికి అవసరమైనంత మేర హిమోగ్లోబిన్ ఉత్పత్తి కాదు. తయారైనా ఎక్కువ కాలం ఉండదు. ఫలితంగా హిమోగ్లోబిన్ నిల్వలు దారుణంగా పడిపోతూ ఉంటాయి. అలా పడిపోయిన ప్రతిసారీ కృత్రిమంగా అందించాల్సి ఉంటుంది.

వ్యాధి లక్షణాలు ఇవీ..

- ఈ వ్యాధి సోకిన చిన్నారులు అడుగుతీసి అడుగు వేయలేరు.
- చిన్న చిన్న బరువులూ మోయలేరు.
- అంతులేని నీరసం, నిస్సత్తువ కుంగదీస్తాయి.
- ఎముకల్లో పటుత్వం సన్నగిల్లుతుంది.
- జీర్ణశక్తి మందగిస్తుంది. పొట్టలావెక్కుతుంది.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

- నిశ్చితార్థానికి ముందు వధూవరులు కంప్లీట్ బ్లడ్ కౌంట్(సీబీసీ), హెచ్‌బీఏ 2లెవెల్ పరీక్షలు చేయించుకోవాలి.
- ఒకరైనా తలసీమియా వాహకులు కాదని తేలితే నిరభ్యంతరంగా పెళ్లి చేసుకోవచ్చు.
- ఇద్దరూ తలసీమియా వాహకులైతే వారికి జన్మించబోయే బిడ్డకు తలసీమియా వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.
- రక్తసంబంధీకుల్లో తలసీమియా వ్యాధి లక్షణాలు ఉన్నాయంటే మరింత జాగ్రత్త పడాలి.

ఎముక మజ్జ మార్పిడి చికిత్సతో నయం



ప్రపంచంలోకెల్లా అత్యధిక తలసీమియా బాధితులు మన దేశంలోనే ఉన్నారు. బాధిత చిన్నారులు తరచూ రక్తం ఎక్కించుకోవాలి. ఎముక మజ్జ మార్పిడి చికిత్స ద్వారా ఈ వ్యాధిని నయం చేయవచ్చు. ఇందుకోసం చిన్నారికి సరిపోయే దాతను గుర్తించి వారి మూలకణాలు చిన్నారికి ఎక్కించాలి. ఇలా చేస్తే 80 శాతం మందికి నయం అవుతుంది.

–డాక్టర్ డాక్టర్ ఆర్. మురార్జి, చిన్నపిల్లల వైద్యనిపుణులు, కర్నూలు

సీఎం జగన్‌కు రుణపడి ఉన్నాం



మాది మిడుతూరు మండలం దేవనూరు గ్రామం. నా భార్య రామేశ్వరి, మాకు ఒక పాప, ఒక బాబు సంతానం. నేను నాకున్న రెండెకరాల పొలంలో వ్యవసాయంతో పాటు కూలీ పనిచేసుకుని జీవనం సాగిస్తున్నాను. నా కూతురు వెంకటేశ్వరికి పుట్టుకతోనే తలసీమియా వ్యాధి సోకింది. పాప వైద్యం కోసం ఎంతో ఖర్చు చేశాం. సాయం కోసం ఎంతో మంది రాజకీయనాయకుల వద్దకు తిరిగినా ఫలితం లేకుండా పోయింది. ఇలాంటి సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేవుడిగా సాయం చేస్తున్నారు. మా పాపకు ఉచితంగా వైద్యం అందించడమే గాక ప్రతి నెలా రూ.10వేల పెన్షన్ ఇస్తున్నారు. సీఎం జగన్‌కు మా కుటుంబం ఎంతో రుణపడి ఉంది. –వడ్డే రమేష్, మిడుతూరు

నాలుగేళ్లుగా రూ.10వేల పెన్షన్ వస్తోంది



మాది ఆస్పరి మండలం ముత్తుకూరు గ్రామం. నా భర్త శ్రీకాంత్ కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తారు. నేను కుట్టుమిషన్ కుట్టి జీవనం చేస్తున్నాం. మాకు ఇద్దరు కూతుళ్లు. చిన్న కూతురు లాస్యకు తలసీమియా వ్యాధి చిన్నతనంలోనే బయటపడింది. ఈ వ్యాధిని నయం చేసుకోవడానికి ఎంతో ఖర్చు చేశాం. ఆర్థికంగా ఎంతో చితికిపోయాం. ఇలాంటి సమయంలో సీఎం జగన్ మాకు దేవుడిగా కనిపించారు. ఆయన వల్లే ప్రతి నెలా పాపకు రూ.10వేల చొప్పున పెన్షన్ వస్తోంది. గత ప్రభుత్వంలో ఏనాడూ మాకు రూపాయి కూడా పెన్షన్ ఇవ్వలేదు. ఈ ప్రభుత్వం ఆరోగ్యశ్రీలో కూడా మా పాపకు చికిత్సను ఉచితంగా చేయిస్తోంది. ఈ ప్రభుత్వానికి మేం ఎంతో రుణపడి ఉన్నాం. –శ్రీలత, ఆస్పరి

ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నాగరాజు


నియామక పత్రాన్ని అందుకుంటున్న గోన నాగరాజు

కర్నూలు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జిల్లాకు చెందిన ఏపీఈడబ్ల్యూఐడీసీ డీఈఈ గోన నాగరాజు ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలోని అరండల్‌పేట బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల్లో నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులు, రిటైర్డు ఐఏఎస్ అధికారి జేబీ రాజు, ఎన్నికల అధికారి ప్రొఫెసర్ ఈఎస్ఎన్ మూర్తి నాగరాజుకు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. అసోసియేషన్‌లో తన బాధ్యతలను మరింత పెంచారని, రాష్ట్రంలోని ఎస్సీ సామాజిక వర్గాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అలాగే అన్ని జిల్లాల్లో అసోసియేషన్ బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. 30 సంవత్సరాలుగా అసోసియేషన్‌లో వివిధ హోదాల్లో పనిచేసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన నాగరాజును సహచర ఉద్యోగులు, వివిధ ప్రజా, దళిత సంఘాల నాయకులు అభినందించారు.

వివాహిత బలవన్మరణం

కర్నూలు(టౌన్): వంట సరిగా చేయడం లేదని భర్త తిట్టడంతో మనస్తాపానికి గురైన భార్య పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. కర్నూలు తాలూకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్టాంటన్‌పురం వద్ద ఉన్న కొండారెడ్డి నగర్‌లో లక్ష్మీదేవి, రంగస్వామి దంపతులు నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వంట విషయమై తరచూ వీరిద్దరి మధ్య గొడవ జరుగుతోంది. శనివారం సాయంత్రం ఇదే విషయంపై గొడవ పడటంతో లక్ష్మీదేవి(38) ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. భర్త, కుమారుడు వెంటనే కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కోలుకోలేక ఆమె మృతి చెందినట్లు తాలూకా పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

అదృశ్యమైన యువకుడి మృతి

- ఎస్సార్బీసీ కాల్వలో మృతదేహం లభ్యం
- కాళ్లు కట్టేసి ఉండటంతో పలు అనుమానాలు


బాలుదాసు నాయక్(ఫైల్)

గడివేముల/ఆత్మకూరు రూరల్: గత నెల 29న అదృశ్యమైన ఓ యువకుడు పది రోజుల తర్వాత శవమై కనిపించాడు. గడివేముల మండలం సోమాపురం ఎస్సార్బీసీ కాలువలో వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గడివేముల ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు...ప్రకాశం జిల్లా గుంటవానిపల్లె గ్రామానికి చెందిన బాలదాసునాయక్(28) ఆత్మకూరులో కొన్నేళ్లుగా ఆర్ఎస్ డిజిటల్ ఫొటో స్టూడియో నిర్వహిస్తున్నాడు. అయితే ఈ నెల 29న తమ కుమారుడు అదృశ్యమైనట్లు తండ్రి మత్రునాయక్ ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదృశ్యమైన బాలదాసునాయక్ మృతదేహం సోమాపురం సమీపంలోని ఎస్సార్బీసీ కాలువలో పడి ఉండటం చర్చనీయాంశమైంది. పాణ్యం సీఐ వెంకటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి ఆత్మకూరు పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు. ఇదిలా ఉండగా మృతదేహం కాళ్లు వైర్లతో కట్టేసి ఉండటంతో హత్యగా స్థానికులు అనుమానిస్తున్నారు. పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


పరీక్ష రాసేందుకు వెళ్తూ..


విద్యార్థిని చెవి కమ్మలు తొలగిస్తూ..


విద్యార్థి శరీర ఉష్ణోగ్రత పరిశీలిస్తూ..

ప్రశాంతంగా 'నీట్'


ముక్కుపుడక తొలగిస్తూ..

వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి ఎన్‌టీఏ ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) ప్రశాంతంగా ముగిసింది. కర్నూలు జిల్లాలో ఏడు పరీక్షా కేంద్రాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష జరిగింది. 5,282 మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు పేర్లు రిజిస్టర్ చేసుకున్నారు. 5,200 మంది హాజరు కాగా 82 మంది గైర్హాజరయ్యారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా మూడు పరీక్ష కేంద్రాల్లో 1,446 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 1,418 మంది హాజరు కాగా 28 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలకు రెండు గంటల ముందే విద్యార్థులు చేరుకున్నారు. కేంద్రాల వద్ద ఎన్‌టీఏ నిబంధనల మేరకు ప్రతి ఒక్క విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసి కేంద్రాల్లోకి అనుమతించారు. విద్యార్థినులు ముక్కు పుడకలు, చెవుల దిద్దులు, చేతుల గాజులు, ఆభరణాలను తీయించారు. – కర్నూలు కల్చరల్/నంద్యాల సిటీ


కర్నూలులోని ఓ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు


పరీక్ష కేంద్రంలో విద్యార్థుల బయోమెట్రిక్ తీసుకుంటున్న దృశ్యం

వేసవిలో తోటల యాజమాన్యం

- అరటి గెలల చుట్టూ ఎండు ఆకు చుట్టాలి
- మామిడికి పండు ఈగ ఆశించే ప్రమాదం ఉంది
- జిల్లా ఉద్యానశాఖ అధికారి రామాంజనేయులు సూచనలు


చీని తోటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి రామాంజనేయులు

కర్నూలు (అగ్రికల్చర్): జిల్లాలో ఉద్యాన పంటలు ఎక్కువగా సాగులో ఉన్నాయి. వేసవిలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే దిగుబడులు తగ్గే ప్రమాదం ఉంది. మే నెలలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున కొన్ని యాజమాన్య చర్యలు చేపట్టాల్సి ఉందని జిల్లా ఉద్యానశాఖ అధికారి పి.రామాంజనేయులు తెలిపారు. మామిడి, అరటి, చీని, నిమ్మ, జామ తోటల్లో చేయాల్సిన పనులను వివరించారు.

- అరటిలో వైరస్ తెగుళ్ల వ్యాప్తి చేసే రసం పీల్చే పురుగుల నివారణకు అసిఫేట్ 1.5 గ్రా ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. అవిశ లాంటి త్వరగా పెరిగే మొక్కలను తోట చుట్టూ 3–4 వరుసలు నాటుకుంటే వేడి గాలులను అడ్డుకుంటాయి. గెలలు సగం పూర్తి అయ్యాక కార్శి పంట కోసం ఒక సూది పిలకను వదిలి మిగిలిన పిలకలను కోసి వెయ్యాలి. వేసవిలో గెలల రక్షణకు ఎండు ఆకు చుట్టాలి. గెలలు వేయడానికి సిద్ధంగా తోటలకు నీటి తడులు దగ్గర దగ్గరగా ఇవ్వాలి. లీటరు నీటికి 5 గ్రాములు పోటాషియం నైట్రేట్ లేదా సల్ఫేట్ ఆఫ్ పొటాష్‌లను మార్చి, మార్చి జిగురుతో కలిపి వారం రోజుల వ్యవధిలో నాలుగుసార్లు ఆకులు, గెలలు పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలి.
- మామిడికి పండు ఈగ ఆశించే అవకాశం ఎక్కువగా ఉంది. దీని నివారణకు తోటల్లో 2మీ.లీ మలథియాన్, 2 మిల్లీలీటర్లు మిథైల్ యుజీనాల్ లీటరు నీటికి కలిపి ఎర ద్రావణం తయారు చేసి ఒక్కొక్క ప్లాస్టిక్ పళ్లెంలో 250 మిల్లి లీటరు పోసి ఎకరాకు నాలుగు చోట్ల ఉంచాలి. ప్యాకింగ్ చేసిన మామిడి కాయలను శీతల గిడ్డంగులలో 12.5 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత, 80–90 శాతం తేమ వద్ద నిల్వ ఉంచాలి. లేత తోటలలో మొక్కలకు నీరు పెట్టడం ద్వారా ఎండ వేడిమి నుంచి కాపాడుకోవచ్చు.
- చీని, నిమ్మతోటల్లో చెట్లపై మంగు నివారణకు, కాయ పగుళ్ల నివారించడానికి బోరాక్స్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తేలికపాటి నీటి తడులు తక్కువ వ్యవధిలో ఎక్కువసార్లు ఇవ్వాలి. అధిక వేడి నుంచి చెట్లను కాపాడుకోవటానికి చెట్ల పాదల్లో ఎండు ఆకులు, వరి పొట్టు పోసుకోవాలి. లీటరు నీటికి 20 గ్రాములు సున్నం కలిపిన ద్రావణాన్ని పల్చటి తెల్లటి పొర ఏర్పడే విధంగా చెట్లపైన కాయలపైన పిచికారీ చేయాలి. ఈ ద్రావణంతో పాటు జిగురు కొద్దిగా కలుపుకుంటే సున్నం ఆకులను, కాయలకు బాగా అతుక్కొని ఎక్కువ కాలం ఉంటుంది.
- జామ తోటలకు నీటి తడులు ఆపాలి. బెరడు తొలిచే పురుగు నివారణకు కాండం రంధ్రాలలో పెట్రోలు లేదా కిరోసిన్‌లో తడిపిన దూదిని ఉంచాలి. కార్బోఫ్యూరాన్ గుళికలను వేసి రంధ్రాలను తడి రేగడి మట్టితో పూడ్చాలి.
- సపోట తోటలకు తప్పనిసరిగా నీరు పెట్టాలి. ముదురు తోటలకు అవసరాన్ని బట్టి నీటి తడులు ఇవ్వాలి. తయారైన కాయలను ఉదయం వేళ చల్లగా ఉన్న సమయంలో కోయాలి.

వెండి నాగాభరణం బహూకరణ

పాణ్యం: ఎస్. కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వామికి వెండి నాగాభరణాన్ని గోస్పాడు మండలం యాళ్లూరు చెందిన కామిశెట్టి నాగేంద్ర కుటుంబీకులు బహూకరించారు. స్వామి వారు తమ ఇంటి ఇలవేల్పు కావడంతో 500 గ్రాముల వెండి నాగాభరణంతో పాటు నిత్యాన్నదానికి రూ.10,016 విరాళం అందించారు. వీరికి ఆలయ మర్యాదలతో సన్మానం చేశారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో అర్చకులు నారాయణస్వామి పాల్గొన్నారు.


స్వామివారికి వెండినాగాభరణాన్ని అందిస్తున్న భక్తులు